క్లుప్తంగా

3, 7 తేదీల్లో గ్రామసభలు

నాదెండ్ల: ఉపాధి హామీ పథకం పనులపై ఆగస్టు నెల 3, 7 తేదీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఏపీఓ పుష్పరాజు చెప్పారు. 8వ తేదిన మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు ప్రజావేదిక జరుగుతుందన్నారు.

కమ్యూనిటీ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి



నాదెండ్ల: గణపవరం గ్రామ రెవెన్యూ పరిధిలోని శివప్రియ నగర్‌ను మంగళవారం పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ టౌన్‌ప్లానింగ్ అధికారి భాస్కరరావు పరిశీలించారు. శివప్రియ నగర్‌లో ప్లాట్ల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను లబ్ధిదారులు ఆయనకు వివరించారు. శివప్రియనగర్ ప్లాట్ల యజమానుల సంఘం అధ్యక్షుడు పేలూరి రామారావు, కార్యదర్శి దివ్వెల సుబ్రహ్మణ్యం, వైస్ చైర్మన్ వీరాంజనేయులు, సభ్యులు మాట్లాడుతూ 1998లో 40 ఎకరాల విస్తీర్ణంలో హైదరాబాద్ టౌన్‌ప్లానింగ్ శాఖ నుంచి అనుమతులు పొంది 400 ప్లాట్లు వేయటం జరిగిందన్నారు. అప్పట్లో కొనుగోలు చేసిన లబ్ధిదారులు ప్రస్తుతం ఎవరి ప్లాటు ఎక్కడుందో తెలియని పరిస్థితిలో ఉన్నారన్నారు. తాము సంఘంగా ఏర్పడి జంగిల్ క్లియరెన్స్ చేసి రోడ్లను బాగు చేస్తున్నామన్నారు. గతంలో కమ్యూనిటీ ల్యాండ్ కింద పంచాయతీకి సుమారు 2 ఎకరాలకు పైగా భూమిని కేటాయించటం జరిగిందని, అయితే కొన్ని ప్లాట్లతో సహా కమ్యూనిటీ భూమిని సైతం కొందరు ఆక్రమించారన్నారు. ఇటీవల తాము స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసి సమస్యను వివరించామన్నారు. శివప్రియనగర్ అభివృద్ధికి తాను కృషి చేస్తానని ఆయన హామీ నిచ్చారన్నారు. భాస్కర్ రావు స్పందిస్తూ పంచాయతీ కార్యదర్శి మారుతిబాబుకు, సచివాలయ సిబ్బందికి, సర్వేయర్లకు ఆయన కొన్ని సూచనలు చేశారు. కమ్యూనిటీ భూమిని పంచాయతీ స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హుడా టౌన్‌ప్లానింగ్ జేపీ రఘురామ్, సచివాలయ కార్యదర్శులు కవిత, జ్యోతిర్మయి, సర్వేయర్లు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



చిలకలూరిపేట: పట్టణాభివృద్ధికి ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో పారిశుద్ధ్య కార్మికులకు రైన్ కోట్లు, ఫేస్ షీల్డ్‌ల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ప్రారంభమై పూర్తి కావాల్సి ఉన్న అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం డ్రెయిన్ల పూడికతీత పనులకు ప్రత్యేకంగా నిధులు కేటాయింపచేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్లు వలేటి వెంకటేశ్వరరావు, కొలిశెట్టి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుని మృతదేహం స్వాధీనం

నరసరావుపేట రూరల్: వినుకొండ రోడ్డులోని పెరల్స్ కల్యాణ మండపం సమీపంలో సుమారు 70 నుంచి 75 ఏళ్ల వయస్సు కల్గిన గుర్తుతెలియని వృద్ధుని మృతదేహాన్ని రూరల్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఆ మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని ఎస్ఐ రోశయ్య తెలిపారు. మృతుని బంధువులు 94407 96244, 94407 96255 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

రొంపిచర్ల: మండలంలోని కొత్తపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు మంగళవారం గ్రామానికి చెందిన దాత కోమటినేని నాసరయ్య నోట్ పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఆక్రమణలు డ్రెయిన్లు దాటి బయటకొచ్చాయి

- వర్షం వస్తే రహదారంతా నీళ్లే
- దృష్టి సారించడం లేదంటూ కౌన్సిలర్ కోట్యానాయక్ ఆగ్రహం
- వాడి వేడిగా చిలకలూరిపేట కౌన్సిల్ సమావేశం



హాజరైన కౌన్సిలర్లు, అధికారులు



షేక్ రఫాని, మున్సిపల్ చైర్మన్

చిలకలూరిపేట: పట్టణంలోని ఎన్ఆర్‌టీ సెంటర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకు డ్రెయిన్లు దాటి ఆక్రమణలు ముందుకు వచ్చాయి.. వర్షం కురిస్తే డ్రెయిన్లలో నీరు ప్రవహించే పరిస్థితి లేక రోడ్డు పైన వర్షపు నీరు ప్రవహిస్తున్నాయి.. అధికారులు ఏం చేస్తున్నారు అంటూ 34వ వార్డు కౌన్సిలర్ వడితే కోట్యానాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మైలవరపు గుండయ్య మున్సిపల్ కౌన్సిల్ హాలులో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కోట్యానాయక్ మాట్లాడుతూ డ్రెయిన్లకు సంబంధించి తగు చర్యలు చేపట్టాలంటూ ప్రశ్నించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ ఇటీవల తాను అనారోగ్యానికి గురై 100 పడకల ఏరియా ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం వెళితే అక్కడ ఎంతో మంది వైద్యులు, సిబ్బంది ఉన్నప్పటికీ ఎవరూ తనను పట్టించుకోలేదని, వైద్యులు స్పందించకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆసుపత్రిలోనే వేచి ఉండాల్సి వచ్చిందని, ఒక కౌన్సిలర్ అయిన తనపట్ల ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. స్పందించిన చైర్మన్ మాట్లాడుతూ తదుపరి సమావేశానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ వచ్చి వివరణ ఇచ్చేలా సమాచారం అందజేయాలని అధికారులకు సూచించారు. 22 వార్డు కౌన్సిలర్ కూనల ప్రమీల మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఎన్ని మంచి నీటి పైపులైను లీకేజీలు గుర్తించారు... వాటిపై తీసుకున్న చర్యలేమిటి అని ప్రశ్నించారు. దీనికి మున్సిపల్ డీఈఈ తోట వెంకటరమణ సమాధానం చెబుతూ మొత్తం 58 లీకులు గుర్తించినట్లు తెలిపారు. ఇందులో 24 లీకులకు మరమ్మతులు నిర్వహించామని, మరో 34 లీకులు సీసీ రోడ్ల కింద ఉన్న నేపథ్యంలో టెండర్లు పిలిచి నిర్వహింప చేస్తామని వెల్లడించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వర రావు మాట్లాడుతూ పట్టణ పరిధిలో ప్రవహించే మురుగు నీరు గణపవరం వైపు మళ్లిస్తున్నారని, ఈ నేపథ్యంలో మురుగునీటి ముంపు సమస్య ఎదుర్కోవాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కల్వర్టు వద్ద మరమ్మతులు నిర్వహించమన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ డీఈఈ వెంకట రమణ మాట్లాడుతూ కల్వర్టు వద్ద పనులు నిర్వహిస్తామని, సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మున్సిపల్ కమిషనర్ సమాధానం చెబుతూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు పారిశుద్ధ్య మెరుగు, అన్ని ప్రాంతాలకు మంచినీటి సరఫరా, పైపులైన్ లీకుల మరమ్మతు వంటి విషయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఎజెండాతో పాటు టేబుల్ ఎజెండాలోని అన్ని అంశాలకు ఆమోదం తెలిపారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు.

లంచాలిస్తే తప్ప బిల్లులు మంజూరు చేయారా?

- ఆగ్రహించిన కౌన్సిలర్ మునగాల లక్ష్మీరెడ్డి
- పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందంటూ మరో కౌన్సిలర్..
- వాడీవేడిగా వినుకొండ మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ(నూజెండ్ల): మూడు సంవత్సరాల క్రితం వార్డుల్లో పనిచేసిన అభివృద్ధి పనులకు నేటి వరకు బిల్లులు మంజూరు కాలేదు.. లంచాలు ఇస్తే తప్ప బిల్లులు మంజూరు చేయారా? అంటూ 31వ వార్డు కౌన్సిలర్ మునగాల లక్ష్మీరెడ్డి అధికారులను ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ సమావేశపు మందిరంలో సాధారణ సమావేశం వాడీవేడిగా జరిగింది. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు స్థానికంగా ఉన్న సమస్యలను ఏకరువు పెట్టారు. 8వ వార్డు కౌన్సిలర్ పాపసాని బ్రహ్మయ్య మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని, కోతలు, వీధికుక్కలు, ఆవులతో పట్టణంలో ఇబ్బందికరంగా మారిందన్నారు. ఎన్నిసార్లు సమస్యలను తెలియజేసినప్పటికీ పట్టించుకుంటున్న వారే లేరని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే విద్యుత్ మీటర్ల కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే జీవీ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిధుల కింద వినుకొండ మున్సిపాలిటీకి రూ.40 లక్షల నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అధికారులు ఎవరైనా లంచాలు డిమాండ్ చేస్తే తమ దృష్టికి తేవాలని అన్నారు. అజెండాలో పొందుపరిచిన అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, డీఈ వెంకయ్య, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెండురోజుల్లో మరమ్మతులు పూర్తిచేయండి

నరసరావుపేట: పట్టణంలోని మూడు ప్రదేశాల్లో గల అన్నా క్యాంటీన్లకు చేపట్టిన మరమ్మతులు వచ్చే రెండురోజుల వ్యవధిలో పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డిప్యూటీ ఇంజినీర్ ఓలేటి శ్రీనివాసరావుతో కలిసి పల్నాడు రోడ్డు, యల్.బి. మార్కెట్ సెంటర్, డాక్టర్ కోడెల శివప్రసాద రావు స్టేడియం వద్దనున్న అన్నా క్యాంటీన్లలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అన్నా క్యాంటీన్ రెన్నోవేషన్ పనులను అన్న క్యాంటీన్ చుట్టుపక్కల ప్రహరీ గోడలు, ఫ్లోర్, మంచినీరు ట్యాప్, పెయింటింగ్, లోపల అవసరమైన ఇంటీరియర్, ఫర్నిచర్, డైనింగ్ హాల్లో అవసరమైన ఫ్యాన్లు, లైట్లు వేటికీ లోపం లేకుండా పూర్తిస్థాయిలో ఆధునీకీకరణ పనులు పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశింశించారు.

రెండు ఆలయాల్లో చోరీ

నాదెండ్ల: గణపవరం నుంచి కావూరు వెళ్లే డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో, అచ్చివారి దేవర అంకమ్మతల్లి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయాల కమిటీ సభ్యులు తెలిపిన వివరాల మేరకు వీరాంజనేయస్వామి ఆలయంలో ఎప్పటిలానే సాయంత్రం 8 గంటలకు పూజలు ముగించి ఆలయాన్ని మూసివేసి పూజారి ఇంటికి వెళ్లాడు. ఆలయ ఆవరణలో ఉన్న గదిలో నైట్ వాచ్‌మెన్ కాపలాగా ఉంటాడు. అయితే సోమవారం సాయంత్రం వాచ్‌మెన్ తన కుమారుడికి అనారోగ్యంగా ఉండటంతో వైద్యశాలకు వెళ్లి తిరిగి రాత్రి 11 గంటలకు ఆలయానికి వచ్చాడు. ఆ సమయంలో ఆలయం ఆవరణలోని లైట్లు ఆపివేసి ఉండటం గమనించి లోనికి వెళ్లాడు. గది తాళాలు పగలగొట్టి గదిని చిందరవందర చేసినట్లు గుర్తించాడు. ప్రధాన ఆలయం తాళాలు పగలగొట్టి వెండి వస్తువులు దొంగలు దొంగిలించినట్లు గుర్తించాడు. దీంతో ఆలయ కమిటీ సభ్యులకు సమాచారమిచ్చాడు. కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆలయ కమిటీ చైర్మన్ కాట్రు శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో మూడు నాలుగు పర్యాయాలు హుండీ చోరీకి గురైందని, రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ ఏర్పాటు చేయాలని కోరారు. సోమవారం రాత్రి గ్రామంలోని అంకమ్మతల్లి ఆలయంలో కూడా తాళాలు పగలగొట్టిన దొంగలు లోనికి ప్రవేశించారు. ఎలాంటి విలువైన వస్తువులు లేకపోవటంతో దొంగలు వెనుదిరిగినట్లు గుర్తించారు.

తాళాలు పగులగొట్టి చోరీ

రొంపిచర్ల: ఇంటిలో ఎవ్వరూ లేని సమయం చూసి తాళాలు పగులగొట్టి రూ.2.5 లక్షల రూపాయలు, బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన ఘటన మంగళవారం మండలంలోని వి.రెడ్డిపాలెంలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. వి.రెడ్డిపాలేనికి చెందిన వీరంరెడ్డి చినకోటేశ్వరరెడ్డి ఈ నెల 9వ తేదీన ఇంటికి తాళాలు వేసి ఊరికి వెళ్లారు. వారు ఊరు నుంచి సోమవారం రాత్రి తిరిగి సొంత ఇంటికి చేరారు. వారు ఇంటికి వచ్చే సరికి తాళాలు పగులగొట్టి, బీరువా తాళాలు తీసి అందులో ఉన్న దుస్తులు చిందరబందరగా పడి ఉండటాన్ని గమనించారు. బీరువాలో ఉన్న లక్ష రూపాయలు, మూడు సవర్ల బంగారు వస్తువులు దొంగలు ఎత్తుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్‌టీం కూడా అక్కడి ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.పి.రవీంద్రబాబు తెలిపారు.

సంక్షిప్తం

తొలిరోజే నూరు శాతం పింఛన్లు పంపిణీ చేయాలి

నాదెండ్ల: ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్లు ఆగష్టు 1వ తేదీన సాయంత్రానికి నూరు శాతం పంపిణీ చేయాలని గణపవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు చెప్పారు. 1వ సచివాలయంలో సచివాలయ సిబ్బందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీపై సమావేశం నిర్వహించారు. గ్రామ పరిధిలో సుమారు 1200లకు పైగా పెన్షన్లు ఉన్నాయని, సచివాలయ సిబ్బంది ఉదయాన్నే 5 గంటల నుండి సాయంత్రంలోగా పెన్షన్లు పంపిణీ పూర్తి చేయాలన్నారు.

బీరుబాటిల్‌తో బెదిరించి నగదు చోరీ

నాదెండ్ల: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని బీరుబాటిల్‌లో బెదిరించి నగదు దోచిన సంఘటన సాతులూరు గ్రామంలో పొనుగుపాడు కాలువ వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామానికి చెందిన ఓ యువకుడు నరసరావుపేటలో చేపల వ్యాపారం చేస్తుంటాడు. ఎప్పటిలానే వ్యాపారం ముగించుకుని తెల్లవారుజామున 4 గంటల సమయంలో బైక్‌పై ఫిరంగిపురం వెళ్తున్నాడు. పొనుగుపాడు కాలువ వద్ద నలుగురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాన్ని అడ్డుకున్నారు. బీరుబాటిల్‌తో పొడుస్తామంటూ బెదిరించి జేబులో ఉన్న నగదును దోచుకున్నారు. ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించాడు. సదరు యువకుడు మీరు నాకు తెలుసు, నన్ను బెదిరిస్తారా అంటూ వారితో అన్నందుకు బీరుబాటిల్ పగలగొట్టి హత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఘటనపై సదరు యువకుడు గ్రామస్తులకు చెప్పి వాపోయాడు.

అనధికార లేఔట్‌ల వివరాలు అందించండి

నాదెండ్ల: చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలో అనధికారిక లేఔట్‌లను గుర్తించి వివరాలు అందజేయాలని పంచాయతీ కార్యదర్శులు, రెవిన్యూ అధికారులకు పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పట్టణ ప్రణాళికా అధికారి భాస్కరరావు చెప్పారు. చిలకలూరిపేట ఏఎంజీ పక్కనే ఉన్న అనధికార ప్లాట్లను ఆయన పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. అనుమతులు లేని లేఔట్లలో వేసిన హద్దురాళ్లు తక్షణమే తొలగించాలని ఆదేశించారు. ప్రస్తుతం అనుమతులు లేని 15 లేఔట్ల వివరాలను పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు అందించారు.

దేశభక్తి అలవరుచుకోండి: ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

శావల్యాపురం: ప్రాథమిక దశ నుంచి విద్యార్థుల్లో దేశభక్తి అలవరుచుకునేలా క్రమశిక్షణతో కూడిన విద్యను ఉపాధ్యాయులు బోధించాలని వినుకొండ నియోజకవర్గ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో బాలికల జూనియర్ బాలికల కళాశాల్లో ఇంటరు విద్యను అభ్యసించుతున్న విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్స్ పంపిణీతో పాటు, బెజవాడ చారిట్రబుల్ ట్రస్టు సారథ్యంలో ఎన్ఎమ్ఎంఎస్ ప్రతిభ పరీక్షల్లో 09 మంది విద్యార్థులకు మొమెంటోలు, జాతీయ క్రీడా పోటీల్లో సత్తా చూపిన బాలికలను అభినందన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో కొల్లిపార వేణుగోపాలరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి, బెజవాడ చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్ సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, ఇంటర్ కళాశాల ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాసరాజు, కొత్తలూరు గ్రామసర్పంచ్ గుంటూరు సాంబశివరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రొంపిచర్ల: ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలని సబ్ యూనిట్ ఆఫీసర్ కుంచాల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సి.హెచ్. వెంకటేశ్వరరావు, వైద్యాధికారి జగన్ నరసింహారెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

పటిష్ఠ చర్యలుతీసుకుంటాం

బొల్లాపల్లి: మండలంలోని మూగచింతలపాలెం గ్రామపరిధిలోని వెలమవారిచెరువు కట్ట ఒక వైపు తెగడంతో నీరు వృథాగా పోతుందని, తక్షణమే చెరువు కట్టను పటిష్టంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు మంగళవారం అధికారులకు తెలియజేశారు. చెరువును ఎంపీడీవో వీఏ విజయ కుమార్, గ్రామీణ నీటిసరఫరా విభాగం ఏఈ కె. రమేష్‌నాయక్‌లు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ చెరువు మైనర్ ఇరిగేషన్ పరిధిలోకి వస్తుందని, సమాచారాన్ని ఆ శాఖ అధికారులకు తెలియజేశామని ఎంపీడీవో తెలిపారు. చెరువు కట్టను పటిష్టంగా ఏర్పాటు చేసి నీరు వృథా పోకుండా అరికట్టే చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆదేశించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ ఏఈ కవిత మాట్లాడుతూ సమాచారం మేరకు చెరువును పరిశీలించి చెరువు కట్ట పటిష్టంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పాఠశాలలు బలోపేతానికి సహకరించాలి

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు, గ్రామస్తులు ప్రవాస భారతీయులు అందరి సహకారం తప్పసరిగా ఉండాలని నరసరావుపేట డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కొల్లిపర వేణుగోపాలరావు అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ప్రభుత్వ పరంగా ఇంటర్ బాలికలకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు బ్యాగ్స్ పంపిణీ కార్యక్రమంలో డెప్యూటీ డీఈఓ పాల్గొన్నారు. అనంతరం జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో బాల్‌బ్యాడ్మింటన్ విభాగంలో రెండవ స్థానం సాధించిన ఇంటర్ బాలికలు ఆకుమళ్ళ సమీరా, ఉప్పు బసవరాణి, వేముల దివ్యలతో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి, పీడీ రాగుల రాధాకృష్ణ మూర్తి ఉపాధ్యాయులు బెజవాడ నాగేశ్వరరావు, అభినందించారు.


అమ్మవారికి బోనాలు

నరసరావుపేట రూరల్: ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని ఇస్సప్పాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారికి హిజ్రాలు మంగళవారం బోనాలు సమర్పించారు. బోనాలతో పట్టణం నుంచి కాలినడకన హిజ్రాలు ఇస్సప్పాలెం చేరుకున్నారు. నృత్యవాయిద్యాలతో బోనాలతో నృత్యాలు చేస్తూ హిజ్రాలు సందడి చేశారు. డివిజన్ పరిధిలోని 150మంది హిజ్రాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకుని బోనాలతో పాటు ఆషాఢం చీరను ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డికి సమర్పించారు. పల్నాడు జిల్లా సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు వారు తెలిపారు. ఆలయ పునర్నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేసుకునేందుకు అమ్మవారి ఆశీస్సులు కోరినట్లు తెలిపారు.

జలశక్తి అభియాన్ ర్యాలీ


శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ ఉపాధి పథకం, పంచాయతీ అధికారులు, సచివాలయ ఉద్యోగుల సారథ్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఈవోపిఆర్‌డి పి.సుగుణ,పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర స్వామి, టీఏలు రోజా, సుధాకర్, పాల్గొన్నారు.

నేను బతికే ఉన్నా సార్!



సారూ.. నేను బతికే ఉన్నా.. వృద్ధాప్య పింఛన్ ఇప్పించమంటూ ఒక వృద్ధ మహిళ నూజెండ్ల ఇన్‌చార్జి తహసీల్దార్‌ను కలిసి విన్నవించింది. మండలంలోని పాత నాగిరెడ్డిపల్లికి చెందిన 76 సంవత్సరాల ఊట్ల గాలెమ్మ ఆన్‌లైన్‌లో చనిపోయినట్లు నమోదై ఉంది. దీంతో ఆమెకు పింఛన్, రేషన్ రావడం లేదు. విషయాన్ని గ్రహించిన గాలెమ్మ తనకు న్యాయం చేయాలంటూ మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దార్ అర్జున్‌నాయక్ వద్ద ఆవేదన వ్యక్తం చేసింది. న్యాయం చేస్తామంటూ అధికారులు భరోసా కల్పించారు. –వినుకొండ(నూజెండ్ల)

జెస్టిస్ చిత్రానికి మరో అవార్డు



వినుకొండకు చెందిన ప్రముఖ జాతీయ చిత్రకారుడు డాక్టర్ వజ్రగిరి జెస్టిస్‌కు అంతర్జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి, భారత చిత్రకళ రత్న బ్రహ్మోత్సవ్ అవార్డు లభించిందని ఒక ప్రకటనలో ఆయన తెలియజేశారు. గత నెలలో కోనసీమ చిత్రకళా పరిషత్ అమలాపురం వారు నిర్వహించిన అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో జెస్టిస్ గీసిన ప్రకృతికాంత చిత్రానికి బహుమతి లభించినట్లు జెస్టిస్ వివరించారు. అవార్డు పొందిన జెస్టిస్‌ను పట్టణానికి చెందిన రాజకీయ ప్రముఖులు, కవులు, అభినందించారు. –వినుకొండ(నూజెండ్ల)